మంచం పట్టిన పత్తిపాక

- ఇంటింటా జ్వరాలే..
- 15 రోజులుగా తగ్గని వైనం
- వైద్యశిబిరాలు నిర్వహించినా ఫలితం శూన్యం


జ్వరంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ భర్త


జ్వరంతో మహిళ


మెడికల్ క్యాంపులో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ధర్మారం: పత్తిపాక గ్రామ ప్రజలను వైరల్ జ్వరాలు, డెంగీ లాంటి జ్వరాలు వణికిస్తున్నాయి. గ్రామంలో ఇంటింటా జ్వరాలు వస్తున్నాయి. 15 రోజుల క్రితం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు డెంగీ పాజిటివ్ నమోదు కాగా.. అప్రమత్తమైన వైద్య సిబ్బంది గ్రామంలోనే వైద్యశిబిరాలు నిర్వహించి పరీక్షలు జరిపారు. జ్వరపీడితుల రక్త నమూనాలు సేకరించారు. ఒకవైపు వైద్యశిబిరాలతో చికిత్సలు అందిస్తుండగానే వైరల్ జ్వరాలు క్రమేణా పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం గ్రామంలో దాదాపు ఇంటింటా జ్వర బాధితులే ఉన్నారు. ఒకే ఇంట్లో తల్లి, తండ్రితోపాటు ఇద్దరు చిన్నారులకు ప్లేట్‌లెట్స్ పడిపోవటంతో.. ధర్మారంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొంత మంది ప్లేట్‌లెట్స్ తగ్గటంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేసి ఇంటిముఖం పడుతున్నారు. మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మిత ఆధ్వర్యంలో ప్రతిరోజు ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలత సమక్షంలో వైద్యసేవలందిస్తుండగా.. మరోవైపు వైరల్ జ్వరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ప్రతి ఇంట్లో జ్వరపీడితులున్నారు.

నేడు వైద్యశిబిరం

విప్ ఆదేశాల మేరకు పత్తిపాక గ్రామంలో ఈనెల 23న మోగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సుష్మిత తెలిపారు. ఈ క్యాంపులో గ్రామంలోని ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాన్ని విప్, కలెక్టర్ సందర్శించనున్నట్లు తెలిపారు.

విప్ పర్యటన..

జ్వరాలతో గ్రామస్తులు బాధపడుతున్నారనే సమాచారంతో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ శనివారం గ్రామంలో పర్యటించారు. జ్వరంతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వెంటనే జిల్లా వైద్యాధికారికి సమాచారమందించి గ్రామానికి రప్పించారు. ప్రభుత్వ విప్‌తో కల్సి జిల్లా వైద్యాధికారి గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారి ఇంటింటికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ఇంటింటా వైద్యమందేలా చర్యలు తీసుకున్నారు. అయినా వైరల్ జ్వరాలు అదుపులోకి రావటం లేదు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ రక్త నమూనాలు సేకరిస్తూ పరీక్షలకు పంపిస్తున్నారు.

క్లుప్తంగా

రైస్‌మిల్లులో తనిఖీలు

కాల్వశ్రీరాంపూర్: మంగపేట అన్న దాత రైస్ మిల్లులో సివిల్ సప్లయ్ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. బియ్యం, ధాన్యం నిల్వలు, స్టాక్ రిజిష్టర్ తనిఖీ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తనిఖీలు చేయడం చర్చనీయాంశమైంది. సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్, డీటీఎస్ రాథోడ్, కాల్వశ్రీరాంపూర్ డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఆర్‌ఐ రాజేందర్, ఎస్సై ఓంకార్ యాదవ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెద్దపల్లిరూరల్: రాగినేడు గ్రామానికి చెందిన మామిడిపల్లి వంశీ(22) చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. గ్రామంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న వంశీ.. ఓ యువతిని ప్రేమించాడని, పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఈనెల 14న క్రిమిసంహారక మందు తాగాడని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎస్సై వివరించారు.

పిచ్చి మొక్కల తొలగింపు

పెద్దపల్లిరూరల్: సబ్బితం గ్రామంలో సోమవారం పిచ్చి మొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. రోడ్ల పక్కన ఏపుగా పెరిగిన మొక్కలను కత్తిరించారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులను కట్టడి చేసే కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించామని మండల పరిషత్ అధికారి సుదర్శన్ తెలిపారు. ఏపీఎం రమేశ్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత ప్రదర్శన

కమాన్‌పూర్: వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక కళాజాత కళాకారులు పాటల రూపంలో అవగాహన కల్పించారు. కళాకారులు కొండ్ర వెంకన్నగౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, నారగోని సరిత తదితరులు పాల్గొన్నారు.

గురువుకు సన్మానం

రామగుండం: పట్టణానికి చెందిన మార్షల్ ఆర్ట్స్ స్పార్క్ కుంగ్‌ఫూ కరాటే మాస్టర్ ఎండీ మునీర్ అలీని పూర్వ విద్యార్థులు సోమవారం ఘనంగా సత్కరించారు. యాదండ్ల అర్జున్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు, ఎండీ సలీంబేగ్, పెద్దంపల్లి శంకర్, గుర్రాల నర్సింహులు, గాదం రామస్వామి, హాజీ, సాజిద్, పొన్నాల శ్రీనివాస్, పూసాల యాదగిరి, నిమ్మరాజుల రవి, దారంగుల కుమార్ తదితరులున్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

మంథని: మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేటలో ఇల్లు కూలి నిరాశ్రయులైన నిరుపేద కుటుంబానికి మత్స్య పారిశ్రామిక మండల శాఖ అధ్యక్షుడు, జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతికుమార్ తన మిత్రులతో కల్సి ఆర్థిక సాయం అందించారు. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన బోయిన్‌పేటకు చెందిన కుంట సమ్మక్క, సందీప ఇల్లు వర్షానికి కూలిపోయింది. క్రాంతి తన మిత్రుల సాయంతో రూ.40వేలు అందించారు.

వెంకట్రావుపల్లిలో కూలిన ఇల్లు

యైటింక్లయిన్‌కాలనీ: మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్‌కు చెందిన మహంకాళి ఇద్దమ్మ ఇళ్లు కూలింది. సోమవారం తెల్లవారు జామున ఇద్దమ్మ తన ఇంట్లో ఉన్న రెండు గదుల్లో వెనక గదిలో నిద్రిస్తుండగా.. ముందు ఉన్న గది గోడలతోపాటు రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో గదిలో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

లోతట్టు నివాస ప్రాంతాలు సందర్శించిన ఎంపీడీవో

రామగుండం: రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జలాశయాల్లోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో లోతట్టు నివాస ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అలీం అన్నారు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ సమీప లోతట్టు ప్రాంతాలను సోమవారం సందర్శించి ప్రజలకు సూచనలు, సలహాలిచ్చారు. ఒకవేళ వరద పరిస్థితి ప్రమాదకరంగా ఉంటే సమీపంలోని కేజీబీవీలో ఆశ్రయం కల్పిస్తామన్నారు. ఇటీవల మండల పరిధిలోని 16 మంది పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ బదిలీ చేయడంతో.. వారి స్థానంలో బదిలీపై వచ్చిన నూతన కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కాలువ తవ్వకం

సాక్షి స్పందన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్ వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జలమయం కావడంతో సోమవారం సాక్షిలో ఇళ్ల మధ్యే మురుగు అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు సోమవారం వర్షపు నీరు, మురుగు నీరు ప్రవహించేందుకు జేసీబీతో కాలువను తవ్వించారు. శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట ప్రకారం వేతనాలు చెల్లించాలి


రైల్వే ఉన్నతాధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రామగుండం: రామగుండం రైల్వే స్టేషన్‌లో రైల్వే వ్యాగన్, క్లీనింగ్ కాంట్రాక్టు కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరుతూ సోమవారం తెలంగాణ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కామధేను ట్రేడింగ్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు అన్‌స్కిల్డ్ కార్మికుడికి రోజుకు రూ.522 చెల్లించాల్సి ఉండగా.. రూ.350 మాత్రమే చెల్లిస్తూ పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయడం లేదన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి బొంకూరి మహేశ్, ఎండీ యాసిన్, సీఐటీయూ ప్రతినిధులు ఎం.రామాచారి, భిక్షపతి తదితరులున్నారు.

ఆలయంలో అన్నదానం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ పునర్నిర్మాణ దాత, నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్ల మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలో భక్తులకు ప్రతి సోమవారం అన్నదానం ఉంటుందని చెప్పారు. మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి రాంగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు పొట్యాల మల్లేశం, గుడిపాటి రాజేశ్వరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, వజ్రారెడ్డి, వెంకటరమణ, పర్శరాములు, గంప రమేశ్, బండి స్వామి తదితరులున్నారు.

హామీలు అమలు చేయకుంటే పోరాటం

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభు త్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఉద్యమం తప్ప దని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధును రైతు రుణమాఫీ పేరుతో మాయం చేసిందన్నారు. సీపీఐ నాయకులున్నారు.

వ్యక్తిగత భద్రతపై అప్రమత్తంగా ఉండాలి


జూలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న స్వప్న, సంధ్య

జూలపల్లి: విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి సఖి కేంద్రం అడ్మిన్ స్వప్న, జిల్లా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సంధ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సఖి కేంద్రం, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీగల్ అడ్మిన్ సుమతి మాట్లాడుతూ.. ఆడపిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని, ఎవరినీ నమ్మొద్దని అన్నారు. ఫైనాన్స్ లిటరసీ స్పెషలిస్టు సంధ్య, హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

ఫెర్టిలైజర్‌సిటీ: 39వ డివిజన్ ఖాజీపల్లి, మాతంగికాలనీలో ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో సీసీ రోడ్లు నిర్మించాలని సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాలైన ఖాజీపల్లి, మాతంగికాలనీలో సీసీ రోడ్డు లేక రోడ్డుపై వర్షం నీరు చేరడంతో.. రోడ్లు బురదమయంగా మారి అవస్థలు పడుతున్నామన్నారు. మేకల మల్లేశ్, సుధాకర్‌రావు, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు బంగారు పతకం


విద్యార్థులకు పతకాలు అందజేస్తున్న విదేశీ ప్రతినిధులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌కు చెందిన హర్షవర్దన్, అభినవ్, రిషి బంగారు పతకం సాధించినట్లు మంకీ కుంగ్‌ఫు కరాటే మాస్టర్ సతీష్ తెలిపారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మాస్టర్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ 2024 కరాటే కుంగ్‌ఫు పోటీల్లో మొత్తం 6 దేశాలు, 8 రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. శ్రీలంక, నేపాల్, థాయిలాండ్ దేశాల గ్రాండ్ మాస్టర్ల చేతుల మీదుగా స్పారింగ్ విభాగంలో విజేతలుగా నిలిచిన సుల్తానాబాద్ విద్యార్థులకు పతకాలు అందజేశారు.

ధర్మారం: ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్–2024 కరాటే అండ్ కుంగ్‌ఫూ పోటీల్లో మండల కేంద్రంలోని బ్రిలియంట్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చి మెడల్స్ సాధించినట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల చెర్మన్ సిరిపురం సత్యనారాయణ తెలిపారు.

వంతెనపై రాకపోకలు ప్రారంభించాలి

రామగుండం: ఎన్నికలకు ముందే వంతెన నిర్మాణం పనులు పూర్తయినా.. ప్రారంభోత్సవం చేసేందుకు ప్రజాప్రతినిధులకు తీరకపోవడం విచారకరమని కేశోరాం కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రతినిధి కౌశిక హరి అన్నారు. సోమవారం బసంత్‌నగర్ రైల్వే వంతెన రాజీవ్ రహదారిపై ఉన్న దారి మైసమ్మకు కౌశిక తన అనుచరులతో మొక్కులు అప్పగించారు. ప్రారంభోత్సవం చేసేలా స్థానిక ప్రజాప్రతినిధికి కలలో మైసమ్మ తల్లి ప్రత్యక్షం కావాలని వేడుకున్నామన్నారు. వచ్చే సోమవారం లోగా ప్రారంభించకుంటే తామే రోడ్డుకు అడ్డుగా ఉన్న మట్టి కుప్పలను తొలగించి రాకపోకలను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తనిఖీలు



బస్టాండ్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న ఏసీపీ కృష్ణ తదితరులు, రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

పెద్దపల్లిరూరల్: గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను అక్రమ రవాణా, వినియోగంపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. సోమవారం పెద్దపల్లి బస్టాండ్, రైల్వే స్టేషన్లలో సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌రావుతో కలిసి డాగ్‌స్క్వాడ్‌తో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. యువతే లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా గంజాయి, ఇతర మత్తు పదార్థాల క్రయ, విక్రయాలు సాగించడాన్ని నిరోధించేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తున్నామని అన్నారు. నార్కోటిక్ శిక్షణ పొందిన స్నిఫర్‌డాగ్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బందితో సోదాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నిజాయితీ చాటుకున్న మహిళ

రామగిరి: ముత్తారం మండల కేంద్రానికి చెందిన ఎర్రవేన విజయకు సెల్‌ఫోన్ దొరకగా.. రామగిరి పోలీస్ స్టేషన్‌లో అప్పగించి తన నిజాయితీని చాటుకుంది.

మహిళలకు రక్షణ కరువు

జ్యోతినగర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ప్రగతిశీల మహిళా సంఘం టౌన్ అధ్యక్షురాలు సరోజన అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి


పెద్దపల్లి తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీ అమలు చేయాలంటూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పట్టణ, మండల అధ్యక్షులు రాజ్‌గోపాల్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసించారు.

మంథని: కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని బీజేపీ నాయకులు ఆర్డీవో హనుమానాయక్‌కు వినతి పత్రం అందించారు. వీరబోయిన రాజేందర్, సబ్బని సంతోష్ తదితరులున్నారు.

బీసీ కులాల సమస్యలు పరిష్కరించాలని మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు పీఏ ఆకుల చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు.

జూలపల్లి: మండల బీజేపీ ఓబీసీ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ బషీరుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ మాట్లాడారు. సంగెం వేణు, గడ్డం తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

సుల్తానాబాద్: బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి రంగుల శంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజన్నపటేల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మినీ కలెక్టరేట్లో తహసీల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కూకట్ల నాగరాజు, చిట్టవేని సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పాలకుర్తి: బీసీ జనాభాకు తగిన నిధులు కేటాయించాలని భారతీయ జనతా పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి డిమాండ్ చేశారు. తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. బాలసాని మల్లేశం, తిప్పని రాజ్‌కుమార్ తదితరులున్నారు.


సుల్తానాబాద్‌లో..

జాతీయ పతాక ఆమోద దినోత్సవ ర్యాలీ

పెద్దపల్లిరూరల్: పట్టణంలో సోమవారం జాతీయ పతాక ఆమోద దినోత్సవ ర్యాలీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించగా.. అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించి దేశభక్తిని చాటుకున్నారు. శాతకర్ణి, రంగనాయక, రంగంపల్లి భీష్మ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పట్టణంలో జాతీయ పతాక ఆమోద దినోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. సోమవారం సీఐ సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ ఉప గవర్నర్ సీమరాజు కోదండరాములు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. స్వప్నకాలనీ మీదుగా రాజీవ్ రహదారి, కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా, పూసాల రోడు, జవహర్‌నగర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులతోపాటు ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీవిద్యార్థులు ఉత్సాహంగా 100 మీటర్ల భారీ త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని పుర వీధుల గుండా దేశభక్తి నినాదాలు, ఆటపాటలతో పాల్గొన్నారు. ఎస్సై శ్రవణ్‌కుమార్, క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్‌కుమార్, మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని సెక్రెట్ హార్ట్ పాఠశాలకు చెందిన 1987–1988 బ్యాచ్ పూర్వ విద్యార్థులు దాదాపు 36 సంవత్సరాల తరువాత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆడిపాడారు. శ్రీనివాస్, అజయ్, నాగపురి రమేశ్, మమత, నీరజ, ఉమ, విజయ, కల్యాణి, మనోహర్‌రెడ్డి, రవిచంద్రరెడ్డి, శశి, విజయకిరణ్, నరేందర్‌రెడ్డి, జాకీర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 గనిలో జరిగిన ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఓసీపీ–2లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు.

విద్యార్థులకు శిక్షణ

ఓదెల: కొలనూర్ హైస్కూల్‌లో శిక్షాపప్తాహ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం టీఎల్‌ఎంలో భాగంగా విద్యార్థులతో బోధనాభ్యాసన ప్రక్రియను సులభతరం చేసే పరికరాలను తయారు చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండొద్దు


సుల్తానాబాద్‌లో వర్షం నీటిని తొలగిస్తున్న మున్సిపల్ కార్మికుడు

సుల్తానాబాద్: ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. సోమవారం పలు కాలనీల్లో ఓపెన్ ప్లాట్లలో నిలిచిన నీటిని మున్సిపల్ కార్మికులు, జేసీబీ సహకారంతో తొలగించారు. మున్సిపల్ సహకారంతో పలు కాలనీల్లో దోమల నివారణ కోసం పిచికారీ ప్రారంభించినట్లు తెలిపారు. వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రాజీవ్ రహదారిపై బూడిద

పాలకుర్తి: కన్నాల టోల్‌ప్లాజా సమీపంలోని జీడీనగర్‌కు వెళ్లే రోడ్డు సమీపంలోని రాజీవ్ రహదారిపై సోమవారం ఓవర్ లోడ్‌తో ఉన్న బూడిద టిప్పర్ నుంచి బూడిద కుప్పలుకుప్పలుగా పడడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ఎన్టీపీసీ యాష్ టెండర్‌ను అడ్డుకుంటాం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ విద్యుత్ ప్రాజెక్టు సంయుక్తంగా ఎంఎస్‌టీసీ ద్వారా ఈనెల 24న యాష్ టెండర్ ప్రక్రియను నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా ఒక ప్రకటనలో అన్నారు.

పరామర్శ

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 గని ప్రమాదంలో మృతిచెందిన సింగరేణి కార్మికులు వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ కుటుంబాలను సోమవారం ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు పరామర్శించారు.

యువతతోనే భవిష్యత్

గోదావరిఖని: సింగరేణి భవిత యువత చేతుల్లోనే ఉందని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ అన్నారు. నలుగురికి కారుణ్య నియామక పత్రాలు అందించి మాట్లాడారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

గోదావరిఖని: సివిల్స్‌లో ప్రిలిమినరీ పాసైన అభ్యర్థులకు సింగరేణి యాజమాన్యం రూ.లక్ష చెల్లించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ నాయకులు రాజరత్నం పేర్కొన్నారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

ఉపాధ్యాయులు..

రామగుండం: ప్రతీనెల ఒకటో తేదీన 010 పద్దున వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ప్లకార్డులతో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసులు..

రామగిరి: డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని సోమవారం కాలనీ వాసులు నిరసన తెలిపారు.

బెస్ట్ కేబినెట్ సెక్రటరీ అవార్డు ప్రదానం

సుల్తానాబాద్: పూసాలకు చెందిన నీలయ్య బెస్ట్ కేబినెట్ సెక్రటరీ అవార్డును జిల్లా గవర్నర్ రాజిరెడ్డి, వెంకటేశ్వర్ల చేతుల మీదుగా అందుకున్నారు.

విజయలక్ష్మికి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు

గోదావరిఖనిటౌన్: లయన్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్‌లో నిర్వహించిన సేవకు సత్కారం కార్యక్రమంలో రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి గోపాల్‌రావు సేవలను గుర్తించి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును అందజేశారు. డాక్టర్ లక్ష్మీవాణి రామగుండం లయన్స్ క్లబ్ మగువ సెకండ్ బెస్ట్ క్లబ్ పురస్కారం, బెస్ట్ పీఎస్‌టీ అవార్డు అందుకుంది.

లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లికి అవార్డుల పంట

పెద్దపల్లిరూరల్: సమాజ సేవలో పాలుపంచుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లికి 2023–24 సంవత్సరానికి అవార్డులు దక్కాయి. జిల్లాలో బెస్ట్ క్లబ్‌గా ఎంపికైన లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి అధ్యక్షుడు వెంకటేశ్వర్లుకు ఉత్తమ అవార్డును సోమవారం జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

డాక్టరేట్ సాధించిన నర్సాపూర్ యువకుడు

ఎలిగేడు: నర్సాపూర్ గ్రామానికి చెందిన కాంపెల్లి సృజన్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ విభాగంలో పర్యావరణ శాస్త్రంలో ఆరేళ్ల పరిశోధనకు గాను డాక్టరేట్ సాధించాడు.

విద్యుత్ ప్రజావాణి

పెద్దపల్లిరూరల్: విద్యుత్ సమస్యలపై నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను ఎస్ఈ బొంకూరి సుదర్శన్ స్వీకరించారు. ఇప్పటివరకు 62 ఫిర్యాదులు స్వీకరించామని, 58 సమస్యలను పరిష్కరించినట్లు ఎస్ఈ వివరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎలిగేడు: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ జిల్లా 7వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బుచ్చమ్మ పిలుపునిచ్చారు. యైటింక్లయిన్‌కాలనీలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.